# మారిపోయిన మనిషి

"ఆ కూత మళ్ళీ కూశావంటే పళ్లు రాల్తాయ్! ఆc- ఏమనుకుంటున్నావో? మరీ వళ్ళు తెలియక చస్తున్నావ్!"

"వళ్ళు తెలియక చస్తుందెవరో తెలుస్తూనే వుంది."

"ముయ్ నోరు! మాటకు మాట ఎదురు చెప్తావా?" శేషయ్య చేతిలోవున్న వంకెకర్ర పెళ్ళాం మీదకు నిలువుగా లేచింది.

"ఊc - కొట్టండి! కూడు పెట్టడం చేతకాకపోయినా కొట్టడం మాత్రం తెలిసిందిలే! ఊc - కొట్టండి, చూస్తారేం?" రెండు చేతులూ అడ్డంపెట్టి ముందుకు ముందుకు జరుగుతూ అన్నది రామసుబ్బమ్మ.

"ఏవిటి నాన్నా, అదీ?" అంటూ శేషయ్య కూతురు వంటింట్లోనుండి పరిగెత్తు కొచ్చింది.

"ఛీ! ఛీ! మనిషిజన్మ ఎత్తేక కాస్త పరువూ మర్యాదా వుండాలి" అంటూ శేషయ్య ఎత్తిన కర్రను దూరంగా విసిరేసి, వసారాలోకి పోయి మంచం వాల్చుకుని మేను వాల్చాడు.

పాతిక సంవత్సరాలు కాపరం చేసిన రామసుబ్బమ్మ భర్తకు తొలిసారిగా ఎదురుతిరిగింది. పతివ్రతా, పరమసాధ్వీ అయిన రామసుబ్బమ్మ, భర్త గీచిన గీటును దాటి ఎరగని రామసుబ్బమ్మ ఈ లోక దైవాన్నే ధిక్కరించింది. సత్యకాలం కాకపోబట్టి సరిపోయింది. లేకపోతే అటు సూర్యుడు ఇటు పొడిచి, నక్షత్రాలు ఝల్లున నేలరాలి, భర్త శాపాగ్నిలో రామసుబ్బమ్మ మలమలా మాడి మసై వుండేది. లేకపోతే చిన్న సైజు నల్లరాతి బండైనా అయి వుండేది.

అదేమీ కాకపోగా రామసుబ్బమ్మ "ఏమాత్రం కొడతావో కొట్టు" అన్నట్టు భర్త మీద మీదకు వచ్చింది.

దానికి తగ్గట్టు కమల ఒకతి! అమ్మకు తగ్గ కూతురే!

అస్త్రసన్యాసం చేసివచ్చి పడుకున్న శేషయ్య మెదడు కుతకుతలాడిపోయింది. జరిగిన సంఘటనను గురించిన ఆలోచనల్లో మునిగిపోయాడు.

ఛ! తను పొరపాటు చేశాడు! ఆ వజాన రెండు తగిలిస్తే పోయేది! దానికి రాను రాను మంచీ చెబ్బరా తెలియకుండా పోతూంది. దీనితోనేనా తను ఇన్నాళ్లు కాపరం చేసింది? ఇంత బతుకూ బతికి ఇంటెనకాల చావమన్నట్టు ఇవ్వాళ ఇది ఇద్దేన్ల వ్యాపారం చేస్తుందా? తన ఇంటా వంటా లేని ఇంత నీచపు పనిని తను ఎలా చూస్తూ ఊరుకుంటాడు?

తమ కులమూ, వంశమూ, పరువూ, మర్యాదా–ఛీ! ఛీ! ఎంత కాకపోతే మట్టుకు తను ఇవ్వాళ ఇంత పరువు తక్కువ పనికి వొప్పుకుంటాడా? బుద్ధితక్కువదానికి, ఆ మాత్రం జ్ఞానం వుండక్కర్లా? ఇడ్డెన్లు వొండుకొని ఇంటింటికెళ్ళి అమ్ముకోవడమా? కస్తూరివారి కోడలు ఇడ్డెన్ల పళ్ళెం ఎత్తుకొని ఇంటింటికీ తిరగడమా? అవ్వ!

గతాన్ని తవ్వుకొని శేషయ్య వంశ చరిత్ర అతని కళ్ళ ముందు గిర్రున తిరిగింది.

శేషయ్యగారి తాత కస్తూరి అమరయ్యగారి పేరు వినని వాళ్లు ఆ చుట్టుపక్కల నాలుగు ఆమడల్లో లేరు. అమరయ్యగారేనాడో అంతరించినా ఆయనగారి కీర్తికి చిహ్నాలుగా, వూళ్లో ఒక దేవాలయమూ, ఒక సత్రమూ, ఒక నుయ్యా, మర్రిచెట్టూ ఈనాటికీ ఉన్నాయ్. శేషయ్య తండ్రి సుక్షేత్రంలాంటి పదిహేనెకరాల మాగాణి కర్పూరం వెలిగించి తండ్రిని మించిన తనయుడు అని అనిపించుకున్నాడు. పోతే శేషయ్య తండ్రి, తాతలా ఆర్జించిన అనంతమైన కీర్తికీ, గౌరవానికీ వారసుడై వుడతా భక్తినీ, మిగిలిపోయిన పదెకరాలనూ, కుటుంబగౌరవం, కీర్తి ప్రతిష్టల క్రింద మార్చి పితృ దేవతలకు కళంకం రాకుండా కాపాడి తన వారసత్వాన్ని నిలుపుకున్నాడు. ఆ వంశ వృక్షంలోనివారు మనకు తెలిసినంతవరకు వొరులకు పెట్టేరేగాని "దేహి" అని ఒకడిని అర్థించలేదు.

శేషయ్య జీవితంలో ఓ అర్ధశతాబ్దం, చీకూ చింతా లేకుండా గడిచిపోయింది. కాని గత రెండు మూడు సంవత్సరాలుగా, ఆర్థికమైన ఈతిబాధలు శేషయ్య ఆత్మకు కాకపోయినా దేహాన్ని పట్టి పీడించసాగాయి.

ఉన్న స్థిరాస్తి, చరాస్తి అప్పులవాళ్ల పాలుకాగా ఓ ఇల్లు మాత్రం మిగిలివుంది. శేషయ్య స్వయంగా వ్యవసాయం చేసేవాడుకాదు. పోనీ ఏమైనా వ్యాపారం చేసేవాడా అంటే అదీకాదు. అది వాళ్ళ వంశంలో లేని సంగతి. "గొప్పగా" "గౌరవంగా" బ్రతకడం వారి వంశంలో వారికి ఉగ్గుపాలతో వచ్చినమాట.

సత్రాలు కట్టించి, సమారాధనలు చేయించిన శేషయ్యగారి ఇంట్లో, ఈరోజు పొయిలో పిల్లి లేవడమే అంతంతమాత్రం అయిపోయింది. ఇంతకాలం భర్తకు ఒదిగి ఒదిగి బతికిన రామసుబ్బమ్మ కళ్ళు తెరిచింది. ఇప్పుడైనా కళ్ళు తెరిచి ఏదో ఒక జీవనాధారం కల్పించుకుంటేగాని భుక్తికి గడిచే మార్గం లేదని తెలుసుకున్న శేషయ్య పెళ్ళాం, ఇడ్డెన్ల వ్యాపారం చేసి పొట్టపోసుకోవాలనే నిర్ణయానికి వచ్చింది.

దొంగతనం... ఇంకా... ఇంకా... చేస్తే తప్పుగాని, కష్టపడి నాలుగురాళ్ళు సంపాదించుకొంటే తప్పేమిటి? ఆ మెరకవీధి వెంకాయమ్మ ఇడ్డెన్ల వ్యాపారంచేసి, ఇద్దరి కూతుళ్ల పెళ్ళిళ్ళుచేసి చిన్న ఇల్లు కట్టుకోలా? అనుకుంది రామసుబ్బమ్మ.

ఓరోజు రామసుబ్బమ్మ తన గోడు పొరుగింటి కాంతమ్మగారితో వెళ్ళబోసుకుంది. ఆమె సాధారణంగా వెంకాయమ్మను చూపించి "ఏమిటమ్మా నీదంతా పిచ్చిగానీ! రోజూ పొద్దున్నే నాలుగు వాయిలు ఇడ్డెన్లు వేసి అమ్ముకుంటే ఒక రూపాయి డబ్బులు కళ్ళ చూస్తావు. ఇంటి ఖర్చు ఎల్లమారిపోదూ? ఆ మెరకవీధి వెంకాయమ్మను చూడరాదూ! ఇద్దరి కూతుళ్ళ పెళ్ళిళ్ళుచేసి, ఇంత నిలవకూడా చేసుకుంది" అంటూ వుండేది.

ఇంట్లో వున్న వెండి కంచాలూ, కూరగిన్నెలూ, మార్వాడీ కొట్లోకి తరలిపోగా, రామసుబ్బమ్మ ఏదో ఒకటి చెయ్యకపోతేగాని లాభం లేదని మథనపడసాగింది.

"ఏమో, ఇడ్డెన్ల వ్యాపారం పెడితే ఆయన ఒప్పుకుంటారో లేదో?" అన్నది ఒక

రోజు రామసుబ్బమ్మ కాంతమ్మతో.

"ఒప్పుకోక ఉరేసుకుంటాడా ఏం, నీదంతా చోద్యం కాకపోతే" అన్నది కాంతమ్మ సాగదీస్తూ.

"తప్పేముందిలే! ఏదో ఒకటి చెయ్యక తప్పుతుందా ఏం? సరేకాని, ఈ పూటకు తవ్వెడు బియ్యం బదులివ్వు, అన్నీ కలిపి రేపిస్తాను." అడిగింది రామసుబ్బమ్మ.

"అయ్యో తల్లీ! మా ఇంట్లోకూడా నిండుకున్నయ్యే! ఈ నెల్లో ఐదు మానికలు నీకే ఇస్తిని? అప్పుడే తెచ్చిన బియ్యమన్నీ అయిపోయాయని ఆయన "ధూంధాం" చేస్తున్నా డమ్మా!" అన్నది కాంతమ్మ.

రామసుబ్బమ్మ సగం చచ్చి, నెత్తిన చీరకొంగు వేసుకొని ఖాళీబుట్ట తీసుకొని ఇంటికి తిరిగొచ్చింది.

రాను రాను రామసుబ్బమ్మకు చేబదుళ్లు పుట్టకుండా పోయినయ్! శేషయ్య చేతికి ఇంట్లో అమ్మదగిన వస్తువేదీ దొరక్కుండాపోయింది.

అనేక రాత్రిళ్లు నిద్ర మానేసి ఆలోచించిన ఫలితంగా, రామసుబ్బమ్మ ఒక నిర్ణయానికి వచ్చింది. ఒకరోజు మెరక వీధి వెంకాయమ్మ దగ్గిరకెళ్ళి ఆమాటా ఈమాటా మాట్లాడుతూ, ఇడ్డెన్ల వ్యాపారంలోని సుళువులూ బరువులూ తెలుసుకు వచ్చింది.

వెధవముండయినా వెంకాయమ్మ నయం! కూతుళ్ళ పెళ్ళిళ్లుచేసి, ఇంత వెన క్కూడా వేసుకుంది. తనకూ పెళ్లీడుకొచ్చిన కూతురుంది. ఆ మనిషి చూస్తే చీమకూడా కుట్టనట్టు తిరుగుతాడు. తను మాత్రం ఏం చెయ్యగలదు? సంసారం గడిచే మార్గం ఏది? "గొప్పగా" బతికిన కుటుంబం అని ఈరోజు పనీపాటా లేకుండా కూర్చుంటే గడుస్తుందా! తను ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒళ్లొంచి నాలుగు వాయిలు ఇడ్డెన్లు వేసి అమ్ముకుంటే తప్పేముంది?

రామసుబ్బమ్మ మథన పడిపడి ఓరోజు భర్తతో అంటే కస్సున లేచాడు.

ఇకపోతే రాగాపోగా ఇల్లుమాత్రం వుంది. ఆయన వాలకం చూస్తే అదికూడా ఏ అమ్మకానికో, తాకట్టుకో పెట్టే ధోరణిలో వుంది. ఆ ఇల్లుకాస్తా పోతే వుండటానికి ఈ నీడ కూడా వుండదు. ఎదిగొచ్చిన పిల్లను రొమ్ములమీద కుంపటిలా పెట్టుకొని తను ఏమైపోతుంది?

శేషయ్య పెళ్లాం తెగింపు చేసింది. ఏమయితే అయిందని ఇడ్డెన్ల వ్యాపారం చెయ్యాలనే నిశ్చయానికొచ్చింది.

ఆ రోజు ఉదయం రామసుబ్బమ్మ తన నల్లపూసల గొలుసు, తనకు పెళ్లయిన కొత్తలో చేయించుకున్నది, తీసి మొగుడికి తెలియకుండా బజారుకు పంపించి అమ్మిం చింది. మెళ్లో వట్టి నల్లపూసలూ, పసుపుకొమ్మూ కట్టుకొని, రెండూ అమ్మగా వచ్చిన ఆరువందల రూపాయలూ పెట్టెలో భద్రంగా దాచింది.

ఎలా పసికట్టాడో శేషయ్య సాయంత్రం రచ్చబండ దగ్గిరనుంచి వచ్చి భార్యమీదకు దూకుడుగా లేచాడు.

రామసుబ్బమ్మ మొండికేసి మోటు సరిచింది.

"ఇల్లాంటి దౌర్భాగ్యపు పనులు చేశావంటే ప్రాణాలు తోడేస్తాను" అన్నాడు శేషయ్య.

"అన్నీ చేశావులే! నోరు మూసుకు ఓ మూల పడుండు!" అన్నది రామసుబ్బమ్మ.

శేషయ్య ఉగ్రుడైపోయి, పళ్లు బిగించి భార్యమీదకు లేచాడు.

ఉద్రేకంతో వళ్ళు మర్చిపోయిన రామసుబ్బమ్మ మరోమాట మిగిలింది.

"ఆ కూత మళ్లీ కూశావంటే పళ్లు రాల్తయ్!" అంటూ శేషయ్య కర్ర పైకెత్తాడు.

అదీసంగతి! ఆరోజు శేషయ్యకు అంత కోపం రావడానికి కారణం-ఇంత బతుకూ బతికి ఇంటెనకాల చచ్చినట్టు భార్య, ఇన్నేళ్లు వచ్చినా ఇంగితజ్ఞానం లేకుండా ఇడ్డెన్ల వ్యాపారానికి సిద్ధమవటం ఏమిటి?

"అదేమిటి నాన్నా?" అంటూ కూతురు తల్లితండ్రుల మధ్యకు రావడంతో కర్ర అవతల పారేసి మంచంమీద నడుం వాల్చిన శేషయ్య మనసు తుకతుకలాడిపోయింది.

ఛీ! ఛీ! ఇక తను దీనితో సంసారం చెయ్యలేడు!

అది వీధినపడి ఇడ్డెన్లు అమ్మడం మొదలుపెట్టాక తను ఏ ముఖంతో ప్రజల ముఖం చూస్తాడు? తరతరాలుగా తన పూర్వీకులు ఆర్జించిన కీర్తి ప్రతిష్ఠలను ఈరోజు ఈ ముండ ఇడ్డెన్ల పాత్రలో పెట్టి కాల్చివేస్తుందా? దీని వాలకం చూస్తే రేపో మాపో ఇడ్డెన్లు అమ్మకం ఆరంభించేట్టుగా వుంది. అది చూస్తూ ప్రాణాలతో తను బతకలేడు. అయినా తన బతుక్కు ఇక అర్థంలేదు. పూలు అమ్మిన చోటే కట్టెలు అమ్మలేడు.

"ఏమయ్యా శేషయ్యా! నీ పెళ్ళాం ఇడ్డెన్ల వ్యాపారం చేస్తుందటగా?" అని నిలేసి ఊళ్లోవాళ్లు అడిగితే తను ఆ మాటలు విని సహించగలడా? తన కుటుంబ గౌరవానికీ, సాంప్రదాయానికీ రేపటితో బలిదానం ప్రారంభం కాబోతోంది. బతికినన్నాళ్లు ఇక తను బతకపోడు! బతికినన్నాళ్లు పరువుగా బతికాడు. పరువు పోయాక ఇక బతుకెందుకూ?

మహాసముద్రంలో వాయుగుండం ప్రారంభం అయాక లేచిపడే అలల్లా శేషయ్య బుర్రలో ఆలోచనలు ఉవ్వెత్తుగా లేచి, సాగి, విరిగిపడుతున్నాయ్! శేషయ్య ముసుగు బిగించి పడుకున్నాడు.

రాత్రి పదిగంటలు దాటింది. కాని శేషయ్య ముసుగు తన్నిపట్టి పడుకొనే వున్నాడు.

"భోజనానికి లేవమనవే!"- రామసుబ్బమ్మ సన్నగా, తలుపు పక్కగా నిల్చొని కూతురితో అన్నట్టు భర్తను ఉద్దేశించి అన్నది.

శేషయ్య ఉలకనూ లేదు. పలకనూ లేదు.

"లే నాన్నా! చాలా పొద్దు పోయింది-" కూతురు కూడా వచ్చి అన్నది.

శేషయ్య ముసుగులోనుంచి ముఖం బయటపెట్టి "పోండి అవతలకు! నాకు అన్నం వద్దూ, ఏమీ వద్దు!" అన్నాడు.

"అదేమిటి నాన్నా, అట్లా అంటావ్?" అన్నది కూతురు దిగులుగా.

"ఈ మంకు పట్టేమిటి ఇన్నేళ్లూ వచ్చి?" అన్నది రామసుబ్బమ్మ.

"ముందు పదండి అవతలికి! మీ చావు మీరు చావండి! నా చావు నేనే చస్తాను. ఇక మీకూ నాకూ సంబంధం లేదు. అం- ఇహ ఇంతే!" అంటూ శేషయ్య మళ్లీ ముఖం మీదకు దుప్పటి లాక్కున్నాడు. బిగుసుకొని పడుకున్నాడు.

అవును, శేషయ్య ఆత్మాభిమాని! ఆత్మాభిమానం ఆయనగారికి ఉగ్గుపాలతో పెట్టింది. శేషయ్య మాటంటే మాటే! హరిహరాదులు అడ్డొచ్చినా తను అనుకొన్న పని సాధించాల్సిందే! మరి శేషయ్యంటే శేషయ్యా? అమరయ్యగారి మనమడు! ఉక్కుపిండం! ఉద్దండుడు! ప్రచండుడు! ఇంకా ఏమేమో ప్రశంసలు అందుకున్నాడు లోకంనుంచి.

శేషయ్య స్వభావం తెలిసిన తల్లీ-కూతుళ్లు అక్కడినుంచి జారుకున్నారు.

"ఆ మనిషికి ఒకళ్ళు చెబితే తలకెక్కదు, తనకు తోచదూ!" నిట్టూరుస్తూ మంచం వాల్చుకొని పండుకుంటూ "ఒసేపిల్లా! నువ్వు పెట్టుకుతినవే!" అన్నది.

"నువ్వుకూడా తినవే!" అన్నది కూతురు.

"నువ్వుపోవే, నన్ను విసిగించక. పోయి తిను." కసురుకుంది రామసుబ్బమ్మ.

కమల మారు పలక్కుండా పిల్లిలా పోయి పడుకుంది.

ఎంత ప్రయత్నించినా రామసుబ్బమ్మకు నిద్రపట్టలేదు. మంచంమీద అటూ ఇటూ దొర్లడం మొదలుపెట్టింది.

ఏం మనిషమ్మా! ముదనష్టపోడు! ఆస్తంతా సర్వనాశనం చేశాడు. తినడానికి కూడు లేకుండా చేశాడు. రెండు చేతులా దానధర్మాలు, పరువూ ప్రతిష్ఠా అంటూ సర్వం దుబారా చేశాడు. ఎదిగొచ్చిన పిల్ల ఇంట్లో వుందనే జ్ఞానం కూడా లేదు. ముసలి పీనుగ ఒప్పుకుంటేనేం? ఒప్పుకోకపోతేనేం? తను వ్యాపారం చేసి తీరుతుంది. నాలుగు వాయిలు ఇడ్డెన్లువేసి అమ్ముకుంటే ఈయన పరువు ప్రతిష్టలు కాలిపోతయ్యట? ఇంటింటికీ చేట పట్టుకెళ్ళి అడుక్కుంటూంటే పరువు కాలిపోదు కాబోలు? నీ పరువూ నువ్వూ మండ!

రామసుబ్బమ్మ పెళ్లున మెటికలు విరిచింది.

ఈ ఆరువందల్తో గుట్టు చక్కగా వ్యాపారం చేసుకోవచ్చు. ఓ రెండు వందలుపెట్టి ఇడ్డెన్ల పాత్రా, మిగతా సామాను కొనుక్కోవచ్చు. ఓ బస్తా మినుములూ, ఓ బస్తా బియ్యం ఒకేసారి కొని ఇంట్లో పెట్టుకుంటే లాభసాటిగా వుంటుంది. తను మాత్రం వీధిన తిరగాలా ఏం? డబ్బులిచ్చి ఓ కుర్రాడిని పెట్టుకొంటే పొద్దున్నే ఓ గంట అట్టాపోయి అమ్ముకొస్తాడు. చుట్టుపక్కల వాళ్లు ఎటుదిరిగీ ఇంటికే వస్తారాయె?

కాస్త బాగా సాగితే మధ్యాహ్నంపూట గారెలూ, చిట్టిగారెలూ వేసి కుర్రాడికిస్తే వాడే అమ్ముకొస్తాడు. పావలా డబ్బులు చేతిలో పెడ్తే ఈ కరువు రోజుల్లో మనిషి దొరక్కపోతాడా ఏం? అయినా పని చేసుకుంటే తప్పేముందీ! తిండి లేక మాడి చస్తారా ఏం? దేవుడు మేలుచేస్తే, కాలం కలిసి వస్తే, వ్యాపారం బాగా సాగుతుంది. నిదానంగా ఓ చిన్న కాఫీ హోటలే పెట్టుకోవచ్చు. అవును మరి? హోటల్ వ్యాపారం చేసి లక్షలు గడించిన వాళ్లున్నారు. పిల్లను ఒక ఇంటిదాన్నిచేస్తే తన దిగులు తీరిపోతుంది.

తను పెట్టబోయే ఇడ్డెన్ల వ్యాపారాన్ని గురించి ఆలోచిస్తూ రామసుబ్బమ్మ కునుకుతీసింది.

తొలికోడి కూసింది. రామసుబ్బమ్మ వళ్ళు విరుచుకుంటూ లేచింది. రాత్రి అన్నం తినకపోవడంవల్ల వళ్లు నీరసంగా ఉంది.

తెల తెలవారుతోంది. బాదం చెట్టుమీద కాకులు రొదచేస్తూ గుంపులు గుంపులుగా అల్లీబిల్లీ తిరుగుతున్నాయ్. బావి దగ్గర ముఖం కడుక్కుని పైట చెంగుతో ముఖం తుడుచుకుంటూ దేవుడి గదిలోకి వచ్చింది రామసుబ్బమ్మ.

ఆ మనిషి నిద్రలేవకముందే బజారుకెళ్ళి సామాన్లు కొనుక్కొస్తే మంచిది. అన్నట్టు కాంతమ్మ సాయం వస్తానన్నది. దాని మొగుడు రామలింగయ్యనుకూడా తీసుకెళ్తే మంచిది. ఆ సుళువు బళువులు తనకు తెలియవాయె! రెండుసార్లు వాళ్ళసాయం తీసుకొంటే ఆ తర్వాత తనే అన్ని పనులూ చేసుకోగలదు. ఇదేం బ్రహ్మవిద్య కనకనా? ఒంటరిముండ

ఆ వెంకాయమ్మ చేసుకోవటంలా?

ఆలస్యమైతే ముసలిపీనుగ లేస్తాడేమో? చూస్తే మళ్లీ రంగం పెట్టుకు కూర్చుంటాడు.

అనుకుంటూ రామసుబ్బమ్మ నిశ్శబ్దంగా నడిచి గదిలోకి వెళ్ళి పెట్టె తెరిచింది. గుడ్డలపొత్తులకింద వేళ్ళు పోనిచ్చి తను ఆనవాలుగా పెట్టిన చోటు వెతికింది.

రామసుబ్బమ్మ గుండెలు 'ఠార్'మన్నాయ్! చేతివేళ్ళు వణికాయ్! బట్టలన్నీ బయటికి తీసి పెట్టెంతా వెతికింది. బట్టల మడతలు ఒక్కొక్కటే విదిలించి చూసింది. పెట్టె తీరుగా బోర్లావేసి వెతికింది.

"హోరి భగవంతుడా! నా డబ్బు!" నిలువు గుడ్లువేసి నేలమీద చతికిలబడి నెత్తి బాదుకుంది.

ఖాళీపెట్టె బావురుమంటూ ఆమెకేసి చూసింది.

రామసుబ్బమ్మ రొమ్ములు బాదుకుంటూ "అయ్యో! దొంగలు పడ్డారర్రో! కొంప గుండం చేశారర్రో!" అని ఏడుస్తూ శేషయ్య పడుకున్న గదికేసి పరుగుతీసింది.

"అయ్యో! మీ నిద్ర మండిపోనూ! కొంప దోపిడీ అయిపోయింది, లేవండర్రో!" అంటూ రామసుబ్బమ్మ తలుపు తీసుకొని గదిలోకి వచ్చింది.

శేషయ్య మంచంమీద లేదు. మంచం బోసిగా, దిగులుగా ఆమెకేసి చూస్తున్నట్టే అనిపించింది.

ఒక్క క్షణంపాటు రామసుబ్బమ్మ నిశ్చేష్టురాలై నిల్చుంది. నివ్వెరబోయిన రామసుబ్బమ్మ తెప్పరిల్లుకొని గదంతా కలయజూసింది.

దండెమీద ఉతికిన ధోవతులు లేవు. కొయ్య పెట్టె మీద బట్టలసంచి లేదు. వంకిన శేషయ్య చేతికర్ర లేదు.

రామసుబ్బమ్మ గాలి బిగపట్టి మంచంకింద చూసింది. శేషయ్య చెప్పులు లేవు.

"అయ్యో! నా కొంప తీశాడర్రో!" అంటూ రామసుబ్బమ్మ ముఖాన చేతులువేసి బాదుకుంటూ భోరున ఏడ్చింది.

కూతురువచ్చి తల్లిని కౌగలించుకొని ఏడ్చింది, అసలు సంగతేమిటో తెలియ కుండానే.

కొద్ది క్షణాల్లో ఇరుగు పొరుగు వాళ్ళంతా వచ్చి గదిలో నిండిపోయారు.

"నేను అనుకుంటూనే వున్నా అంతపనీ చేస్తాడనీ!" అన్నాడు ఓ ముసలాయన.

అందరూ తలొక మాటా అన్నారు.

"శేషయ్య పారిపోయాడా?" అన్నాడు ఒకాయన రామసుబ్బమ్మ మొఖంలోకి లోతుగా చూస్తూ.

✿ ✿ ✿

రైల్లో ఓ మూల ఒదిగి కూర్చొనివున్న శేషయ్య ముఖం గంభీరంగా వుంది.

రైలు వేగాన్నీ, రొదనూమించి శేషయ్య బుర్రలో ఆలోచనలు సాగినై-

తను ఈ శరీరాన్ని కొద్దిరోజుల్లోనే త్యజించబోతున్నాడు. తన అభీష్టమూ నెరవేరింది. ఆ ఆరువందల రూపాయలతోపాటు దాని వ్యాపారం గల్లంతే! అయినా తను... ఆరువందలు... డబ్బంతా తీసుకురాకపోతే బాగుండేదేమో? తను చావదల్చుకుంటే ఇంతకంటే వేరుమార్గాలు లేవా? ఇంటిదగ్గిర ఏ బావిలోపడి చచ్చినా, వురిపోసుకున్నా,

ముందు పోలీసులొచ్చి చుట్టుకుంటారు. శవాన్ని తీసుకెళ్ళి ఆసుపత్రిలో కోస్తారట! ఎంత దారుణం? తను అలా ఎన్నటికీ జరగనివ్వడు.

శేషయ్యకు తనమీదనే కాకుండా తన శరీరంమీదకూడా వల్లమాలిన అభిమానం ఏర్పడింది.

తన జీవితకాలమంతా చాలా సత్కార్యాలు, దానధర్మాలూ చేసి పుణ్యం ఆర్జించాడు. అలాంటి తను హీనమైన చావు చావలేడు. తన శరీరాన్ని పవిత్రమైన గంగా జలాల్లోనే వదలదల్చాడు. గంగలో ప్రాణాలు అర్పించిన వారికోసం కైలాసం తలుపులు బార్లాగా తెరిచివుంటాయట! తను అంతకంటే కోరుకోతగిన చావులేదు.

ఏమైనా దాన్ని గురించిగానీ, పిల్లను గురించికానీ ఆలోచించడం అనవసరం. వాళ్ళతో తనకు రుణం తీరిపోయింది. ఈ లోకంతోటే తనకు ఋణం తీరిపోయింది. ఈ డబ్బుతో పుణ్యక్షేత్రాలు దర్శించి కాశీచేరి గంగలో ప్రాణాలు త్యజిస్తాడు.

శేషయ్య కృష్ణా, గోదావరీ నదుల్లో స్నానాలు చేసి ఇంత పుణ్యం మూటగట్టుకొని తన ప్రయాణాన్ని సాగించాడు. పూరీ జగన్నాథుని దర్శించి, త్రివేణీ సంగమానికి పయనమైనాడు. త్రివేణీలో మునిగి కాశీకి ప్రయాణం కట్టాడు. మార్గమధ్యంలోవున్న పుణ్యతీర్థాలు సేవించీ, పుణ్యక్షేత్రాలు సందర్శించీ, ఎట్టకేలకు శేషయ్య కాశీ చేరాడు.

కాశీ చేరేసరికి శేషయ్య చేతిలో పది రూపాయలు మాత్రమే మిగిలివున్నాయ్. వెళ్ళిన రోజే గంగలో స్నానంచేసి కాళీదేవిని దర్శించి రాత్రి అయేసరికి కాళీఘాటుకు దగ్గిరలోవున్న ఓ సత్రానికి చేరుకున్నాడు. ఆరోజు భోజనానికీ అదీపోగా ఇంకా ఆరురూపాయలూ, చిల్లరా మిగిలివుంది.

ఆ రాత్రి పడుకొని శేషయ్య ఆలోచించాడు-

తను రేపు ఈ జీవితాన్ని చాలించబోతున్నాడు. తనకు భూమిమీద నూకలు నిండాయి. తనకు భగవంతుని ఆజ్ఞ అయింది. తెల్లవారుఝామున నదిలో స్నానం చేస్తూ- అలా... అలా... లోపలకు పోయి గంగమ్మ తల్లి ఒడిలో శాశ్వతంగా కన్ను మూస్తాడు. తనకు ఆఖరు రాత్రి ఇదే. తను పడుకున్న చోటున రేపు ఈ శేషయ్య వుండడు. ఈ చోటు-తను ఇప్పుడు పడుకొన్న చోటు-రేపు ఖాళీగా వుంటుంది.

శేషయ్య లేచి కూర్చొని తను పడుకొన్న చోటును మమకారంతో తడిమి చూచుకున్నాడు. శేషయ్య అంతరంగంలోని అజ్ఞాతశక్తులేవో జీవితంమీద ఆశల్నీ, మమకారాన్నీ రెచ్చగొడుతున్నాయి. భార్యాబిడ్డల్ని తల్చుకుని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

ఛీ! తను ఇంటికి తిరిగిపోవడమా? ఏ ముఖం పెట్టుకొని తిరిగిపోతాడు? తను ఇంత దిగజారిపోతున్నాడేం! తనకోసం ఓవైపు కైలాసద్వారాలు తెరిచివుంటే-మళ్ళీ ఆ నరకంలోకి పోతాడా? ఈ గుక్కెడు ప్రాణం-కళ్ళు మూసుకొని బుడుంగుమంటే సరిపోయే! ఆ తర్వాత తనకు బొలెడంత శాంతి! శివుడి ఆజ్ఞ అయింది. ఇక ఈ జీవితానికి మంగళం పాడాల్సిందే!

ఎవరికెవరు? ఏది శాశ్వతం? అంతా మాయ! అంతా మిథ్య!

గంగానది హోరు వినబడుతోంది. శేషయ్య బుర్రలో ఆలోచనలు, నదిలోని అలల్లా అనంతంగా లేచి పడుతున్నాయి. ఆలోచిస్తూనే శేషయ్య మగతగా, మత్తుగా నిద్రలోకి జారిపోయాడు.

ఏ తెల్లవారుఝామున నిద్రపట్టిందో పాపం, శేషయ్య నిద్రలేచేటప్పటికి తెల్లగా తెల్లవారిపోయింది. సూర్యకిరణాలు శేషయ్య వంటికి చురచుర తగిలాయి.

శేషయ్య ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు.

ఎంతపని జరిగింది? తను చావదల్చుకున్న మనిషే? మరణించాలనుకొంటూ అంత మైమరచి నిద్రపోయాడా?

శేషయ్యకు తనమీద తనకేదో రోత పుట్టింది.

అంత రోతలోనూ, శేషయ్యకు హృదయాంతరాళాల్లో ఎక్కడో ఆనందం మువ్వల చప్పుడు చేస్తూ గంతులేసింది. శేషయ్యలోని నైరాశ్యం దాని గొంతు నులిమి పైకి వచ్చింది.

ఛీ! ఏం బ్రతుకు? తను చావడానికి సందేహిస్తున్నాడా? ముమ్మాటికీ లేదు. తను సందేహించడంలేదు. ఇటు సూర్యుడు అటు పొడిచినా ఇక తను ఆగడు. తను చచ్చి తీరుతాడు!

శేషయ్య లేచి సంచి సర్దుకుని వేగంగా గంగానది ఒడ్డుకేసి బయలుదేరాడు.

ఉదయభానుడి కిరణాలు గంగమ్మ తల్లిని పొదివి పట్టుకున్నాయి. వెండి తళుకులు కప్పుకొని గంగానది మెరుస్తోంది.

నదిఒడ్డుకు వచ్చిన శేషయ్య జేబులో చెయ్యి పెట్టుకొని తడిమి చూచుకున్నాడు. ఇంకా ఆరు రూపాయిలూ, కొంత చిల్లరా వుంది.

ఈ డబ్బుతో ఈరోజుకూడా మహారాజులా జీవితం గడపొచ్చు. మళ్ళీ తను ఈ జీవితాన్ని చూడబోతున్నాడా ఏం? గంగానదిలో ప్రాణాలు విడిచే తనకు మళ్లీ జన్మంటూ వుండదు. హాయిగా ఈ డబ్బుల్తో ఈరోజు తిని, రేపు చావచ్చు! మిగిలిన డబ్బులు... మిగిల్తేనే గుడ్డివాళ్ళకు దానం చెయ్యవచ్చు. ఆ ఫలితం కూడా దక్కుతుంది. ఆఖరు రోజు తను మనసారా తినీ, ఆనందించీ, మరీ చస్తాడు. అదీగాక ఇప్పుడు నదిలోపడ్తే ఎవరైనా చూసి బయటికి లాగుతారు. అప్పుడు తన పనేంగాను? అన్నట్టు గుర్తొచ్చింది. తన మతిమండ! అసలు సంగతే ఇంతవరకూ గుర్తులేదు. రేపు వైకుంఠ ఏకాదశి. పర్వదినం! ఏకాదశినాడు మరణిస్తే స్వర్గద్వారాలు తెరిచివుంటాయనీ, పుష్పకవిమానం వచ్చి తీసుకెళుతుందనీ శాస్త్రాలు ఘోషిస్తున్నాయ్. ఇన్నాళ్ళూ వుండి, తను చూస్తూ చూస్తూ ఈరోజు చావడం ఏమిటి? రేపు ఏకాదశి! తెల్లవారుఝామున ఈ తుచ్ఛ దేహాన్ని విసర్జించి తను పరమాత్మలో లీనం అయిపోతాడు. తెల్లవారుఝామునైతే తను మునగడం ఎవరూ చూసి బయటకు లాగరుకూడా.

శేషయ్య దంతధావనం చేసి, నదిలో స్నానంచేసి సత్రానికి తిరిగొచ్చాడు. నదినుండి తిరిగొచ్చిన దగ్గరనుంచీ అతని మనసు పీకుతూనే వుంది.

తను భయపడుతున్నాడా? ప్రాణంమీద తనకు మమకారం తీరలేదా? ఏమిటి తను ఇలా మెత్తబడిపోతున్నాడు? శేషయ్య అంతరాత్మ ఘోషించింది. కాని శేషయ్య మళ్లీ తన అంతరాత్మను తనే సమాధానపర్చుకున్నాడు.

వైకుంఠం తలుపులు రేపు బార్లాగా తెరిచివుంటాయి. లోపలకు తను సునాయాసంగా ప్రవేశించగలడు.

రాత్రి శేషయ్య మళ్ళీ మథనపడసాగాడు.

ఇంకా కొన్ని గంటల్లో తను ప్రాణాల్ని త్యజించబోతున్నాడు. జీవితం ఎంత

చిత్రమైనదీ? ఇవ్వాల్టి తెల్లవారుఝామున తను నదిలో పడివుంటే తను ఇప్పుడు ఇక్కడ వుండేవాడా? తను పడుకొన్న చోటు ఖాళీగా వుండేది.

శేషయ్య శరీరం జలదరించింది.

ఇప్పుడు తన శరీరం గచ్చుమీద బరువుగా వాలివుంది. తను ఈరోజు ఎన్ని వింతలు చూశాడు? ముష్టివాళ్లూ, రిక్షావాళ్లూ-అంతా బతుకుమీది ఆశతో ఎంత కోలాహలంగా తిరుగుతున్నారు?

అరే! ఏమిటి తను ఇలా ఆలోచిస్తున్నాడు? తను బతికి ఇంకేం చేస్తాడు? తిరిగి ఇంటికి వెళ్ళగలడా? వెళ్లి ఊళ్లో వాళ్ళ ముఖం చూడగలడా? ఇంతపనీ జరిగాక తను పెళ్లాం ముఖం చూడగలడా? అది ఇద్దెన్ల వ్యాపారం చేస్తుంటే తను చూసి సహించగలడా? తన ఆత్మాభిమానం ఏమైంది? తన పౌరుషం మంట గలిసిందా? ఏమైనా తను ఈ నిర్ణయాన్నుంచి వెనుదిరగలేడు! తన హృదయంలో రగులుతున్న ఈ చిచ్చు, గంగా గర్భంలో ఆరవలసిందే! తను మరణిస్తాడు-మరణిస్తాడు-వైకుంఠ ఏకాదశి తెల్లవారు ఝామున ఆ గంగమ్మ పొత్తిళ్ళలో శాశ్వితంగా కళ్ళుమూస్తాడు.

తన ఆత్మకు శాంతీ-ముక్తీ...మోక్షం లభిస్తాయి. తను జన్మరాహిత్యం పొందుతాడు!

గంగానది రొద మృత్యుదేవత లాలిపాటలా వినబడుతోంది శేషయ్య చెవులకు.

అతని హృదయంలో-ఆశా-నిరాశా-జీవితమూ-మృత్యువూ-పెనుగులాటతో నిండిపోగా భయంకరమైన ఆలోచనలతో, పీడకలలతో ఆ రాత్రి మూడు ఝాములు గడిపాడు శేషయ్య.

నాలుగో ఝామున శేషయ్య లేచి, బట్టల సంచి సర్దుకొని నిశ్శబ్దంగా సత్రంలో నుంచి బయటకు నడిచాడు.

వీధులన్నీ నిర్మానుష్యంగా వున్నాయి.

గంగానది హోరు దూరంగా వినబడుతుంది.

పిండి ఆరబోసినట్టు వెన్నెల.

శేషయ్య చకచకా నదికేసి నడక సాగించాడు.

గంగానది తెల్లత్రాచులా మెరుస్తూ గంభీరంగా కదిలిపోతోంది.

శేషయ్య నది దరిదాపులకు వచ్చేసరికి వెనకనుండి ఏదో శబ్దం వినిపించింది. శేషయ్య వేగంగా నడుస్తూ నదిని సమీపించాడు. వెనకనుంచి వస్తోన్న శబ్దం శేషయ్య వేగాన్ని మించి దగ్గరౌతూంది.

శేషయ్య నది మెట్లమీద కాలుపెడుతూనే చేతిలోని సంచిని నదిలోకి విసిరేశాడు. పంచెను మొలకు దోపుకుని నదిలోకి దూకబోతున్న శేషయ్య భుజాలమీద బలమైన చేతులు పడ్డాయి. నదిలోకి ఒరిగిపోతున్న శేషయ్య శరీరాన్ని బలవంతంగా ఒక్క గుంజు గుంజాయి ఆ చేతులు.

శేషయ్య వెనక్కు తిరిగిచూసి నివ్వెరపోయాడు.

పోలీసులు శేషయ్య చెరో రెక్కా పట్టుకొని నిల్చున్నారు.

నదిలో పోవాల్సిన శేషయ్య ప్రాణాలు పోలీసుల చేతుల్లో పోయినట్టయినయ్.

"నగలన్నీ నదిలోనే పారేశావా?" అన్నాడు ఒకడు. వాడి భాషలో.

శేషయ్య నిలువుగుడ్లు వేశాడు.

"పంచెలో ఏమన్నా దాచాడేమో?" అంటూ ఒకడు శేషయ్య చేతులు పట్టుకోగా, రెండవవాడు బట్టలు తనిఖీ చేశాడు.

"ఊఁ- పద, స్టేషన్‌కు. అక్కడగాని అసలు వ్యవహారం బయటపడదు," మెడమీద చెయ్యి వేసి పోలీసుస్టేషన్‌కు నడిపించారు శేషయ్యను.

✿ ✿ ✿

ఆ క్రితం రాత్రే సత్రంలో పడుకొన్న ఒక బాలిక చేతి గాజులూ, మెళ్లో గొలుసూ మాయమవడంవల్లా, శేషయ్య ప్రవర్తన అనుమానకరంగా వుండటంవల్లా, అతణ్ణి వెంబడించి పట్టుకోబోగా, చేతిలోవున్న నగలసంచిని నదిలోకి విసిరినట్టూ అది పోలీసులు కళ్లారా చూసినట్టూ కేసు బనాయించబడింది.

తనపేరు తప్ప, ఊరూ, జిల్లాకూడా చెప్ప నిరాకరించిన శేషయ్యకు మూడు సంవత్సరాల కఠినశిక్ష పడింది.

✿ ✿ ✿

జైలు సెల్లులో కూర్చుని శేషయ్య తన విధిని నిందించుకున్నాడు.

ఏకాదశి ముందురాత్రే నదిలో దూకివుంటే తనకు ఆ అవస్థ పట్టేదికాదుగా? తెగింపు చెయ్యలేని తనకు తగిన శాస్తే జరిగింది.

ఒక్క క్షణం ముందయితే తను నదిలోకి దూకి వుండేవాడు. ఆ ఒక్క క్షణం ఆలస్యమే తనను ఈ నరకంలోకి తోసింది.

భగవంతుడు తనను ఇంకా పరీక్షిస్తున్నాడు. ఈ జీవుడికి విముక్తి దొరికేరోజు ఇంకా రాలేదు కాబోలు. తను ఎంత నికృష్టమైన జీవితాన్ని అనుభవించాల్సి వచ్చింది? హంతకుల-దొంగల మధ్య తన నివాసం నేడు!

అమరయ్య మనమడికి ఎంత దుర్గతి పట్టింది?

ఇంకా నయం- తన ఊళ్లో, తన వాళ్ళకి విషయం తెలియదు. తెలిస్తే ఇంకేమయినా వుందా? తన తరతరాల వాళ్ళకూ అపనింద చుట్టుకోదూ?

శేషయ్యను రాజమండ్రి జైలుకు మార్చారు మూడు నెలల తర్వాత.

తను ధైర్యంగా పోలీసు లాఠీపోట్లకు నిలబడ్డాడు కాని, తన ఊరేదో, తనెక్కడివాడో చెప్పలేదు.

ఆ ఆలోచనలో శేషయ్య మనసుకు తృప్తి కలిగింది.

తను ఈరోజు చెయ్యని నేరానికి శిక్ష అనుభవిస్తున్నాడు. తను దొంగతనం చెయ్యడమా? శివ! శివ! శిష్టజన రక్షకుడవే! అపద్బాంధవా! ఎక్కడున్నావయ్యా? ఇంత ఘోరం జరుగుతూ వుంటే చూస్తూ వున్నావేమయ్యా?

"అవును! నువ్వు దొంగవే!" శేషయ్య అంతర్వాణి ఘోషించింది.

అవును, తను దొంగే! తన భార్య దాచుకొన్న డబ్బు కాజేసి తను పరారి అయ్యాడు.

"హే భగవాన్! క్షమించు! అందుకు నన్ను ఈ విధంగా శిక్షించావా?"

తన సొమ్ము తను తీసుకోవడం దొంగతనమా? ఆ ముండ ఇద్దెన్ల వ్యాపారం పెడ్తాననకపోతే తను ఈ పాడుపని చేసి వుండేవాడా?

"ఏంది సేసయ్యా, మా ఏదాంతిలా కూకున్నావ్? లే! లే! రాళ్ళు పగలగొట్టాలంట. వార్డర్ పిలుత్తొన్నాడు" అన్నాడు ఒక ఖైదీ.

"సేసయ్యంటే సేసయ్యే! మాలావు ఏదాంతిలే! బలే దొంగేశాలు ఏత్తాడు. మనందర్నీ మించిపోయాడనుకో!"

బీడీదమ్ములు లాగుతూ నలుగురైదుగురు ఖైదీలు శేషయ్య చుట్టూ చేరారు.

"ఇంకా కూర్చున్నారేమర్రా, లేవండి!" వార్డర్ కర్ర తిప్పుకుంటూ వచ్చాడు.

తాగే బీడీలు అవతల పారేసి, నెత్తి టోపీలు సర్దుకుంటూ బయలుదేరారు ఖైదీలు. శేషయ్య మౌనంగా వాళ్ళతో కలిసి నడిచాడు.

రాళ్లు పగలగొడ్తూ శేషయ్య అరచేతులు చూసుకొని ఖిన్నుడైనాడు.

ఏనాడూ పూచికపుల్ల పనిచెయ్యని తనకు ఈ గతి పట్టిందా!

పని సరిగా చెయ్యనివాళ్ళని వార్డర్ బూతులు తిడుతుంటే శేషయ్యకు రోషం ముంచుకొచ్చేది. తననెక్కడ తిడతాడోనన్న భయంకొద్దీ ఒళ్ళొంచి పనిచేసేవాడు. రాళ్ళు పగలగొట్టడం, నీళ్లు తోడడం, కొయ్యలు చెక్కడం శేషయ్య దినచర్య అయింది.

రాత్రిళ్ళు తనతోటివాళ్ళు తమ అనుభవాలు కథలల్లి చెపుతూవుంటే, వింటూ వుండేవాడు శేషయ్య. రాను రాను శేషయ్యంటే మిగతా ఖైదీలకు గురి ఏర్పడింది. అధికారులకూ మంచి అభిప్రాయం వుండేది. శేషయ్య ఖైదీల తరపున వాళ్ళ కష్టసుఖాలు అధికారులకు విన్నవించేవాడు.

తోటి ఖైదీలు తమ గతాన్ని తవ్వి చెబుతూ వుంటే శేషయ్య ఆసక్తితో వినేవాడు. చిన్నతనంనుంచీ సోమరితనానికి అలవాటుపడి, ఏ పనీ చెయ్యకుండా దొంగతనానికి దిగి, జీవితంలో సగభాగం జైళ్ళలోనే గడిపిన ఖైదీలను చూసి మధనపడేవాడు శేషయ్య.

కొందరి జీవితాలు ఎందుకిలా అవుతాయ్? అని ఆలోచించేవాడు.

తనకు అంతకుముందు తెలియని ఎన్నో విషయాలు తెలుస్తున్నట్టుగా వుంది శేషయ్యకు.

ప్రతి చిన్నదానికోసం మానవుడు ఎంత తహతహలాడిపోతాడో, పరిశ్రమిస్తాడో జైలు జీవితంలో అర్థం అయింది శేషయ్యకు.

ఒక్క బీడీముక్క ఎంత శ్రమపడి సంపాదిస్తారు ఈ ఖైదీలు?

తను ఆత్మహత్య చేసుకోనందుకు శేషయ్య ఇప్పుడు బాధపడడంలేదు.

ఎన్నెన్నో వింతగాథలూ, పతితల చరిత్రలూ తను విన్నాడు. పగలంతా పనిచేసి – రాత్రిళ్లు వళ్లు మరిచి నిద్రపోవడంలో ఎంత సుఖం వుంది?

వీళ్లందరకూ లేని కారణాలు తనకుమాత్రం ఏమున్నాయి, ఆత్మహత్య చేసుకోవడానికి? తనెంత పొరపాటు చేసిందీ ఇప్పుడు అర్థం అవుతోంది. భార్య ఇద్దెన్ల వ్యాపారం పెట్టి సంసారాన్ని ఈదుకొస్తానంటే తనెంత అవివేకంగా ప్రవర్తించాడు? ఆనాటి అభిమానం, పౌరుషం ఇప్పుడేమైనాయి? తన వంశ గౌరవం, కీర్తి ప్రతిష్టలూ ఈనాడు తనకు అక్కరకు వచ్చాయా? వళ్లు వంచి పనిచేస్తే వార్డరు ఊరుకుంటాడు. లేకపోతే కర్ర పైకెత్తుతాడు.

తల్లీ కూతుళ్లు ఏమైపోయారో? తను వారిపట్ల ఎంత నిర్దయగా, దారుణంగా ప్రవర్తించాడు? అందుకు తాను తగిన శిక్షే అనుభవిస్తున్నాడు.

శేషయ్య రాత్రిళ్లు తన సెల్లులో పడుకొని ఆలోచిస్తూ కుమిలి కుమిలి ఏడ్చేవాడు.

కాలం గడిచే కొద్దీ ఖైదీల అభిమానాన్ని పొందగలిగాడు శేషయ్య. తోటివాళ్ళపట్ల శేషయ్య ఎంతో ఆదరణా, వాత్సల్యం చూపించగలుగుతున్నాడు. సత్ప్రవర్తనకు శేషయ్య

అధికారుల మన్ననలనుకూడా పొందగలిగాడు. వయసు ముదిరి కాయకష్టం చెయ్యలేని స్థితిలోవున్న శేషయ్యకు బండ చాకిరీ తప్పింది. ఖైదీలకు వంట చెయ్యడానికి నియమించుకున్నారు. శేషయ్యకు ముందు ముందు కొంచెం కష్టంగా వున్నా, వంట చేయడంలో ఎంతో నేర్పును చూపించాడు. శేషయ్య వంట పరిశుభ్రంగా, రుచికరంగా చేసేవాడు. ఖైదీలు ప్రశంసాపరంపరలు శేషయ్యమీద కురిపించసాగారు. తనూ వాళ్ళతో కబుర్లు చెబుతూ కాలక్షేపం చెయ్యసాగాడు.

కాలం గడుస్తున్న కొద్దీ జైలునుంచి ఎప్పుడు బయట పడదామా అన్న ఆరాటం ఎక్కువయింది.

తన పెళ్ళాం, బిడ్డ ఏమైపోయారో? ఇంకా ప్రాణాలతో వున్నారో లేదో? వున్నా తిండి దొరక్క ఎంత బాధపడుతున్నారో?

రోజు రోజుకు శేషయ్య హృదయం ఆవేదనతో దహించుకుపోతుంది.

ఏ క్షణాన ఈ జైలుగోడలుదాటి తను బయటపడ్తాడో? తన భార్యాబిడ్డల్ని ఎప్పుడు చూడగలుగుతాడో?

శేషయ్య ఆరోజు కోసం ఎదురుతెన్నులు కాస్తున్నాడు.

✿ ✿ ✿

ఆ రోజు రానేవచ్చింది.

శేషయ్య విడుదలయ్యాడు.

శేషయ్య మిత్రులు గేటుదాకా వచ్చి వీడ్కోలు ఇచ్చారు.

నేరుగా స్టేషన్‌కు వచ్చి రైల్లో ఇంటికి ప్రయాణమైనాడు శేషయ్య. శేషయ్య ఎక్కిన రైలు కాలాన్నీ, దూరాన్నీ చీల్చుకొని వేగంగా, శరవేగంగా ప్రయాణం చేసింది.

తెలతెలవారుతుండగా శేషయ్య దిగాల్సిన స్టేషన్‌కు బండివచ్చి ఆగింది.

శేషయ్య రైలు దిగాడు.

అక్కడినుంచి తన ఊరు ఐదు మైళ్ళలో వుంది. నడిచి వెళ్తే అన్నం వేళకు వెళ్ళగలడు. బస్ ఎక్కితే ఓ అర్ధగంటలో దింపుతుంది.

రైలుదిగి శేషయ్య అంతా పరికించి చూశాడు. స్టేషన్ అంతా మారిపోయివుంది. స్టేషన్ వెడల్పూ, పొడవూ కూడా పెంచారు. స్టేషన్ పక్కనే రెండు కొట్లుకూడా వెలిశాయి. స్టేషన్‌కు వంద గజాలదూరంలో, రోడ్డుపక్కగా ఓ హోటల్‌కూడా వెలిసింది.

ఎంతలో ఎంత మార్పు!

రోడ్డుపక్క చెట్లూ చేమలూకూడా మారిపోయినట్టు అనిపించింది శేషయ్యకు.

తను ఊరు వదిలి వెళ్ళిపోయేప్పుడు, ఇక్కడ ఒక్క బీడీకొట్టుకూడా లేదు. స్టేషనూ ఎంతో చిన్నదిగా వుండేది. మూడు సంవత్సరాలుకాదు- తను ముప్పై సంవత్సరాలు అజ్ఞాతవాసాన్ని అనుభవించినట్టుంది శేషయ్యకు.

స్టేషన్‌దాటి బయటకువచ్చి ఒక్క నిముషం తటపటాయించాడు. శేషయ్య నడిచి వెళదామా, బస్సుమీద వెళ్దామా అని, జేబులోని చిల్లర చూసుకున్నాడు.

ఎనభై పైసలుంది. బస్‌లో వెళితే అరవై పైసలు కావాలి. బస్‌లో వెళితే కాఫీకి సరిపోవు. వళ్లు నీరసంగా వుంది. రాత్రంతా నిద్ర లేకపోవడంతో తల బద్దలు కొట్టుకుపోతోంది. కాఫీ తాగితే కొంత సర్దుకుంటుంది. పైగా ఆకలిగా కూడా వుంది.

ఏదైనా తిని, కాఫీ తాగి వెళ్తే మంచిది.

వెధవ బస్ ఎందుకు? డబ్బులు దండుగ? చల్లబాటివేళ మెల్లగా నడిచివెళ్తే ఎంత పని?

శేషయ్య హోటల్‌లోకి వెళ్ళి కూర్చున్నాడు. అది చాలా చిన్న హోటల్. నాలుగు బల్లలు వేసి వున్నాయి. ఒకపక్కగా చిన్న టేబులూ, కుర్చీ వేసి వున్నాయి. తడికకు సినిమా పోస్టర్లు అంటించి వున్నాయి.

కుర్చీలో కూర్చుని డబ్బు లెక్క చూసుకుంటున్న పాతికేళ్ళ యువకుడు లేచివచ్చి "ఏం ఇవ్వమంటారూ? వేడి వేడి ఇడ్లీ వుంది, ఇవ్వమంటారా?" అని అడిగాడు.

"ఊఁ" అని తల ఊపాడు శేషయ్య.

అప్పటికి ఇద్దరు కూర్చుని కాఫీ తాగుతున్నారు. శేషయ్య ఇడ్లీ తినేసరికి వాళ్లు కాఫీ ముగించుకొని బయటకి వెళ్ళారు.

బస్ వచ్చి హోటల్‌కు అంతదూరంలో ఆగింది.

"వేడి వేడి పెసరట్టు వుంది, ఇవ్వమంటారా?"

"అల్లప్పచ్చడి వుందా?" అన్నాడు శేషయ్య.

నోరు సవిచచ్చివుంది. అల్లప్పచ్చడి రుచిని తల్చుకుంటూ ఆప్యాయంగా అడిగాడు.

"ఓ- ఫస్తుకలాసుగా వుంది! పెసరా ఒకటీ!" లోపలకు కేకపెట్టాడు ఆ యువకుడు.

లోపల పెనంమీద "సుయ్" మన్న ధ్వని శేషయ్య చెవులకు విన్పించింది.

పెసరట్టుకూడా తిని "కాఫీ!" అన్నాడు శేషయ్య.

ఇడ్లీ, పెసరట్టు తిన్నమీదట శేషయ్యకు పొట్టలో మత్తుగా అనిపించింది.

సర్వరు-కమ్-మేనేజరు-శేషయ్యకు కాఫీ ఇచ్చి లోపలకు వెళ్ళాడు.

శేషయ్య కాఫీ తాగుతుండగా బస్సు కదలబోతూ వుంది. కండక్టరు కేకలు వేస్తున్నాడు, బస్సు పోతోందని.

అబ్బ! ఈ కాఫీ తాగినమీదట బస్‌లో పోతే ఎంత హాయిగా వుంటుంది?

ఆ ఆలోచన బుర్రలో కదలగానే శేషయ్య కళ్లు హోటలంతా కలియజూశాయి.

ఆ హోటల్లో తను మినహా ఇంకెవరూ లేరు. లోపలకు పోయిన హోటల్ యజమాని బయటికి రాలేదు. వస్తున్న అలికిడికూడా లేదు. క్షణంలో బస్ బయలుదేరబోతూంది. తను బస్సెక్కి కూర్చుంటే ఎవరు చూడొచ్చారు? అతను బయటికి వచ్చేసరికి బస్ దాటి వెళ్లిపోతుంది. తను డబ్బు ఇవ్వడం మర్చిపోయాడు. ఆఁ- అంతే! ఆ మాత్రం తను చెప్పలేడా? గజదొంగల్ని తను ఎరుగు. అంతా సహవాస దోషం... అంతే! ఆఁ- అంతే!

శేషయ్య లోపలకు తొంగిచూసి, ఒక్క దూకులో హోటల్‌నుంచి బయటపడి, బస్‌కేసి పరిగెత్తాడు.

సాగిన బస్ శేషయ్యను చూసి ఆగింది.

శేషయ్య బస్ ఎక్కి కూర్చున్నాడు.

శేషయ్య గుండెల్లో బస్ ఇంజెనుకు మించిన రొద సాగింది.

బస్ స్టార్ట్ అయినట్టే అయి మళ్ళీ ఆగింది.

మళ్ళీ ఆగిందేం? ఒక్క నిముషం శేషయ్య ప్రాణాలు బిగబట్టుకు కూర్చున్నాడు.

వెనకనుంచి హోటల్ యజమాని కేకలు వేసుకుంటూ పరిగెత్తుకొచ్చి, శేషయ్య

చొక్కా పట్టుకొని బస్సులోనుంచి ఒక్క గుంజు గుంజాడు.

"ఎక్కడికి పోదామనుకున్నావురా దొంగనాయాలా! తెగ తిని పారిపోదామనుకున్నావా?"

శేషయ్య చొక్కా పట్టుకొని హోటల్లోకి లాక్కెళ్ళాడు.

పాపం, శేషయ్య! ఏం చెబుతాడు?

"దొంగ సచ్చినోడా! ఎవడి సొమ్మురా, తేరగా తిని పారిపోతున్నావ్? ఉండూ! నీ తల పండు పగల!" గల గలమంటూ లోపల అట్లపెణం దగ్గరనుంచి ఆడది కాలే కాలే అట్లకాడతో జనాన్ని తోసుకుంటూ శేషయ్య ముందుకొచ్చింది.

శేషయ్య గుడ్లు తేలేశాడు. నోరు బిగుసుకుపోయింది.

"ఎద్దులాగున్నావు పని చేసుకోగూడదూ? ఈ దొంగ బుద్ధేమిటి నీకూ? నీ సిరుసు పగలా!" అంటూ ఆమె చేతిలోని అట్లకాడను శేషయ్య ముఖంమీదకు ఎత్తింది.

"అమ్మా ఆగవే! ఆ మనిషి ఎవరో చూడు!" అన్నది కూతురు తల్లికి అడ్డంవచ్చి.

"అవునే అమ్మాయ్!" ముఖమంతా కళ్ళు చేసుకొని చూసింది ఆమె.

"మా నాయ...న...లాగున్నాడే!" సన్నగా దీర్ఘం తీసింది కూతురు.

ముఖంలోకి పరీక్షగా చూసి "అలాగ ఉండటమేమిటే? మీ నాయనే!" అన్నది తల్లి.

"అయ్యో మీరా?" ఆశ్చర్యంతో ఉక్కిరి బిక్కిరి అవుతూ శేషయ్య ముందు నిల్చుంది రామసుబ్బమ్మ.

రామసుబ్బమ్మ రెండు చేతులూ పట్టుకొని "నేనే! నన్ను... నన్ను..." వణుకుతున్న శేషయ్య కంఠంలోనుంచి "క్షమించు!" అన్న శబ్దం బయటికి రాలేకపోయింది.

"అట్లా గుడ్లప్పగించి చూస్తారేం? మా నాయనే... మీ మామగారు" హోటల్ సర్వర్ కమ్ మేనేజర్ అయిన యువకుణ్ణి ఉద్దేశించి అన్నది శేషయ్య కూతురు కమల.

"తస్సాదియ్యా! పారిపోయిన మనిషా?" అన్నాడు అల్లుడు.

"కాదు- మారిపోయిన మనిషి!" అన్నది రామసుబ్బమ్మ ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ.

(1955 - హంస మాసపత్రిక)